# ఋణం తీర్చుకున్నాడు

"ఈ లెక్చరర్ జాబ్ చెయ్యడం కంటె దోపిడీలు, దొంగతనాలు చేసి బతకడం బెటరనిపిస్తోంది" అన్నాడు బలరాములు క్లాసులోంచి విసురుగా బయటకొచ్చి, స్టాఫ్‌రూంలోకి ప్రవేశిస్తూ.

స్టాఫ్‌రూంలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న ఐదారుగురు లెక్చరర్లు అతనికేసి ఆశ్చర్యంగా చూశారు.

"మళ్ళీ యేమైంది బలరాములు?" అన్నాడు రాజగోపాలరావు – ఆ కాలేజిలో పనిచేస్తున్న లెక్చరర్లందరిలో సీనియర్ లెక్చరర్ ఆయనే.

"బి.కామ్. థర్డియర్‌లో రమణమూర్తి అనే ఓ రౌడీ స్టూడెంట్‌ను గూర్చి మీకు తెలుసుకదా... ప్రతిరోజూ వాడితో యేదో సమస్య... నేను పాఠం చెబుతోంటే వాడు పక్క స్టూడెంట్స్‌తో మాట్లాడుతుంటాడు... సెల్‌ఫోన్లో ఎవరితోటో మాట్లాడు తుంటాడు. ఐపాడ్ చెవుల్లో పెట్టుకొని సినిమా పాటలు వింటూ డాన్స్ చేస్తున్నట్టుగా కాళ్ళు చేతులు తిప్పుతుంటాడు. ఈరోజు వాడు మరీ రెచ్చిపోయి డెస్క్ మీదకెక్కి సీలింగ్ ఫ్యాన్‌ను పట్టుకోబోయాడు. 'కోతి చేష్టలు మానుకోరా' అని నేను గట్టిగా అరిస్తే నేను కోతినే సార్! అంటూ వాడు కోతిలా జంప్ చేసి సీలింగ్ ఫ్యాన్ పట్టుకున్నాడు. అదృష్టవశాత్తు ఫ్యాన్ తిరగటం లేదు. వాడు సీలింగ్ ఫ్యాన్ పట్టుకొని వేలాడుతోంటే మిగతా స్టూడెంట్సందరూ గొల్లుమని నవ్వడం... 'డర్టీ బాస్టర్డ్స్' అని నేను గట్టిగా అరచి బయటకొచ్చేశాను" అన్నాడు బలరాములు.

"బాస్టర్డ్స్! అన్నారా. చాలా తప్పుకదా... వాళ్ళు రెచ్చిపోతే మనమూ రెచ్చిపోయి అలాంటి మాటలంటే తప్పవుతుంది" అన్నాడు రాజగోపాలరావు.

"యేం చెయ్యమంటారు సార్! వాడంత అసహ్యంగా ప్రవర్తిస్తే నాకు పిచ్చి ఆవేశం వచ్చేసింది" అన్నాడు బలరాములు... అటెండర్ రిజిస్టర్‌ను టేబుల్ మీదకు విసిరేస్తూ.

"ఈ టీచింగ్ జాబ్‌లో ఉన్నవాళ్ళకు చాలా ఓపికుండాలి. వాళ్ళు మన స్టూడెంట్స్. వాళ్ళది ఉడుకురక్తం. వాళ్ళల్లో అల్లరిచేష్టలు చెయ్యాలనే మనస్తత్వం ఉంటుంది. వాళ్ళను మనం ఓపికగా ఎదురుకొని కంట్రోల్ చెయ్యాలె.... వాళ్ళు మన పిల్లల్లాంటి వాళ్ళని మరచిపోకూడదు" అన్నాడు రాజగోపాలరావు.

"నాకు ఓపిక తక్కువ సార్... నేనసలు ఈ జాబ్‌లోనే ఉండను... రిజైన్ చేసి వెళ్ళిపోయి వేరే యేదైనా జాబ్ చూసుకుంటాను..." అన్నాడు బలరాములు.

"మీరు గ్రూప్ టూ సర్వీసెస్ ఎగ్జామ్ రాశారు కదా... మీకు యే డీఎస్పీగానో జాబ్ రావొచ్చు..." అన్నాడు స్టాఫ్‌రూంలో కూర్చున్న మరో లెక్చరర్ రామ్‌నారాయణ్.

"మూడుసార్లు రాశాను... అది వస్తుందా? చస్తుందా?" అన్నాడు బలరాములు.

"ఎందుకు రాదు... మీకు అన్ని అర్హతలున్నాయి... మీది చాలా మంచి పర్సనాలటీ... ఆరడుగుల ఎత్తు.... అంతకు తగ్గ లావు... దేనికి భయపడకుండా ముందుకు చొచ్చుకుపోయే టెంపర్‌మెంట్. పోలీస్‌జాబ్ మీకు తప్పకుండా వస్తుంది... మీకా జాబైతేనే బాగా సూటవుతుంది" అన్నాడు రామ్ నారాయణ్.

"మరో విషయమండోయ్.... ఆయనది బి.సీ. ఏ గ్రూప్... డెఫినిట్‌గా ఆయనకీసారి సెలక్షన్ వస్తుంది" అన్నాడు అక్కడే ఉన్న మరో లెక్చరర్ ఆనందం.

వాళ్ళలా మాట్లాడుకుంటుండగానే బయట "లెక్చరర్ బలరాములు... డౌన్... డౌన్... కులం పేరుతో ఓ విద్యార్థిని దూషించిన బలరాములును వెంటనే సస్పెండ్ చెయ్యాలి... బలరాములు... డౌన్... డౌన్..." అన్న విద్యార్థుల కేకలు వినిపించాయి.

"నేననుకుంటూనే ఉన్నాను... విద్యార్థుల నుండి ఇలాంటి రెస్పాన్స్ వస్తుందని.... బాస్టర్డ్ అనే మాట చాలా అభ్యంతరకరమైన మాట... మీరామాట అనాల్సింది కాదు... పైగా ఆ రమణమూర్తి ఎస్.సీ. స్టూడెంట్..." అన్నాడు రాజగోపాలరావు.

"అయితే యేమిటి? వాడు క్లాసులో అలా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించవచ్చా?" అన్నాడు బలరాములు.

అతడలా అంటుండగానే రమణమూర్తితో సహా ఇరవై, ముప్పై మంది విద్యార్థులు స్టాఫ్‌రూంలోకి పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్రవేశించారు.

"బలరాములు డౌన్! డౌన్" అనే నినాదాలు మిన్నుముట్టాయి... రమణమూర్తి పిడికిలి బిగించి బలరాములు మీదికి వెళ్ళబోతుండగా రాజగోపాలరావు

"రమణమూర్తీ! ఆగు!" అని అరిచాడు.

రమణమూర్తి ఆగిపోయాడు. మిగతా విద్యార్థులు కూడా నినాదాలు చెయ్యడం ఆపేశారు.

"మీరందరూ ఇటు రండి... యేం జరిగిందో చెప్పండి" అన్నాడు రాజగోపాలరావు.

విద్యార్థులంతా రాజగోపాలరావు చుట్టూ చేరారు.

"ఈయనకసలు పాఠాలు చెప్పడం రాదు సార్... తట్టుకుంటూ తట్టుకుంటూ గొణుగుతున్నట్టుగా చెబుతాడు... మాకస్సలు వినబుద్ధికాదు. ఎప్పుడైనా డౌట్స్ అడిగితే "పిచ్చిప్రశ్న! కూర్చో" అంటూ కసురుతాడు. ఆయన లెక్చరర్‌గా అన్‌ఫిట్ సార్..." అన్నాడు రమణమూర్తి.

"నువ్వు స్టూడెంట్‌గా అన్‌ఫిట్!" వెంటనే అరచినట్టుగా అన్నాడు బలరాములు.

"బలరాములు గారు! మీరు కాస్సేపు ఊరుకోండి..." అన్నాడు రాజగోపాలరావు.

"చూశారా సార్! అతడెలా మాట్లాడుతున్నాడో... ఆయనకస్సలు పాఠం చెప్పడం రాదుసార్... క్లాసులో గోల చేస్తుంటామని మామీద అరవడం తప్ప ఈయనసలు పాఠం చెప్పనే చెప్పడు సార్!" అన్నాడు మరో విద్యార్థి సంతోష్‌కుమార్.

సంతోష్‌కుమార్‌ను ఆ క్లాసులోకెల్లా తెలివైన కుర్రాడని, చాలా బుద్ధిమంతుడని చెబుతారు.

"చూడు సంతోష్! ఆయన లెక్చరర్‌గా కొత్తగా వచ్చాడు. నాల్గు రోజులు పోతే ఇంప్రూవ్ అవుతాడు... మీరతనికి కోఆపరేట్ చెయ్యాలి... ఇలా అల్లరి చెయ్యకూడదు" అన్నాడు రాజగోపాలరావు.

"పాఠం బాగా చెబితే మేం అల్లరెందుకు చేస్తాం సార్. మీ క్లాసులో ఎప్పుడైనా అల్లరి చేశామా సార్! పాఠం చెప్పరాకపోతే కోఆపరేట్ చెయ్యండని రిక్వెస్ట్ చెయ్యాలి. రిక్వెస్ట్ చెయ్యడం పోయి నోటికొచ్చినట్టు తిడ్తే ఎవరు పడ్తారు సార్! ఈరోజు మమ్మల్ని 'బాస్టర్డ్స్' అని తిట్టాడు" అన్నాడు సంతోష్.

"యేదో ఆవేశంలో అన్నాడు. దాన్నంత సీరియస్‌గా తీసుకోకండి..." అన్నాడు రాజగోపాలరావు.

"సీరియస్‌గానే తీసుకుంటాం సార్. ఆయన అంతు చూడకపోతే నాపేరు రమణమూర్తే కాదు సార్!" అన్నాడు రమణమూర్తి చాలా ఆవేశంగా.

"అంతు చూస్తావా? యేం చూస్తావురా! నేనూ నీ అంతు చూస్తాను... డర్టీ బాస్టర్డ్" అంటూ ఆవేశంతో ఊగిపోతూ రమణమూర్తి మీదకు రాబోయాడు బలరాములు.

"బలరాములు గారూ! మిమ్మల్ని కామ్‌గా ఉండమన్నానా?" అరచినట్టుగా అన్నాడు రాజగోపాలరావు.

"చూశారా సార్! చూశారా! ఆయన మళ్ళీ అదే మాట! ఎంత అహంకారమో చూశారా సార్! ఊరుకోం సార్! ఇంతసేపు మీమీదున్న గౌరవంతో ఓపిక పట్టాం సార్..." అంటూనే వాళ్ళు

"బలరాములు - డౌన్...డౌన్...

బలరాములు - డౌన్...డౌన్...

బలరాములును - సస్పెండ్ చెయ్యాలి.

బలరాములును - డిస్మిస్ చెయ్యాలి.

కులంపేరుతో దూషించిన బలరాములును - అరెస్ట్ చెయ్యాలి" అంటూ విద్యార్థులంతా పెద్దపెట్టున నినాదాలు చేశారు. వాళ్ళ నినాదాలతో ఆ స్టాఫ్‌రూం దద్దరిల్లిపోయింది.

అలా అరచుకుంటూ విద్యార్థులంతా ప్రిన్సిపాల్ రూం వైపు కదిలిపోయారు. ప్రిన్సిపాల్ రూంలో కూడా "బలరాములు డౌన్‌డౌన్" అన్న కేకలు మిన్నుముట్టాయి.

బలరాములును వెంటనే సస్పెండ్ చెయ్యాలని రమణమూర్తితో బాటు మిగతా విద్యార్థులు కూడా ప్రిన్సిపాల్‌తో వాదించారు. చాలా సేపటివరకు ప్రిన్స్‌పాల్‌ను మాట్లాడనీయకుండా నినాదాలు చేశారు.

పరిస్థితి కొంచెం సద్దుమణిగాక

"యేం జరిగిందో తెలుసుకోవడానికి నేనో ఎంక్వయిరీ కమిటీ వేస్తాను. వాళ్ళిచ్చిన రిపోర్టును బట్టి నేను యాక్షన్ తీసుకుంటాను. ఇప్పటికిప్పుడు అతన్ని సస్పెండ్ చెయ్యమంటే అది నాతో అయ్యేపని కాదు" అన్నాడు ప్రిన్సిపాల్.

"ఇప్పుడే... ఈ క్షణమే యాక్షన్ తీసుకోవాల"ని విద్యార్థులు పట్టుబట్టారు.

"సస్పెండ్ చెయ్యడం నా చేతుల్లో లేదు" అన్నాడు ప్రిన్స్‌పాల్.

"మీరు రాజగోపాలరావు సార్‌ను పిలిచి అడగండి సార్! ఆయన ముందే వీడు మమ్మల్ని రెండోసారి బాస్టర్డ్స్ అంటూ తిట్టాడు సార్" అన్నాడు రమణమూర్తి.

"మీరు కాస్సేపు బటయకు వెళ్ళండి. నేను రాజగోపాలరావు గార్ని పిలిపించి యేం జరిగిందో తెలుసుకుంటాను" అన్నాడు ప్రిన్స్‌పాల్.

విద్యార్థులంతా బయటకెళ్ళారు.

అటెండర్ వెళ్ళి రాజగోపాలరావుకు 'ప్రిన్స్‌పాల్ రమ్మంటున్నారు సార్!' అని చెప్పాడు.

రాజగోపాలరావు ప్రిన్స్‌పాల్ రూంలో ప్రవేశించాడు. ఆ కాలేజీలో యే సమస్య ఉత్పన్నమైనా ప్రిన్స్‌పాల్ రాజగోపాలరావునే పిలిచి ఆయన సలహా అడుగుతాడు. రాజగోపాలరావంటే ఆ కాలేజీలో అందరికీ - అటు విద్యార్థులకు, ఇటు లెక్చరర్లకూ - గౌరవమే.

విద్యార్థుల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటూ పాఠాలు బాగా చెప్పడం... అత్యంత శాంత స్వభావుడన్న పేరు... ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయస్థాయిలో పురస్కారం... అపకారికి కూడా ఉపకారం చేసే అతని ఉదారభావం... పాఠాలు చెప్పడమే కాకుండా ఆ ఊర్లో జరిగే అనేక సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, మంచి పబ్లిక్ స్పీకర్‌గా పేరు తెచ్చుకోవడం మొదలైన అంశాలన్నీ కలిసి రాజగోపాలరావును ఆ ఊరి ప్రజలందరికి అత్యంత గౌరవనీయవ్యక్తిగా మార్చేశాయి.

రాజగోపాలరావు, ప్రిన్స్‌పాల్‌తో చాలాసేపు మాట్లాడాడు.

బలరాములుతో రమణమూర్తికి క్షమాపణ చెప్పిస్తే సమస్య పరిష్కారమౌతుందన్న నిర్ణయానికొచ్చారు.

ఇదే విషయాన్ని రమణమూర్తిని, సంతోష్‌కుమార్‌ని ప్రిన్స్‌పాల్ రూంలోకి పిలిపించి చెప్పారు.

వాళ్ళిద్దరూ వెళ్ళి మిగతా విద్యార్థులతో చర్చించారు.

గంట తర్వాత అందరూ కలిసి ప్రిన్స్‌పాల్‌రూంలో కొచ్చారు.

"క్షమాపణ చెప్పినా మేం ఊరుకోం సార్! అతన్ని సస్పెండ్ చెయ్యాల్సిందే" అన్నారు విద్యార్థులంతా ముక్తకంఠంతో.

అప్పుడు రాజగోపాలరావు వాళ్ళతో చాలాసేపు మాట్లాడాడు.

"ఓ లెక్చరర్‌ను సస్పెండ్ చేసే అధికారం ప్రిన్స్‌పాల్‌కుండదు. కమీషనర్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్‌కుంటుంది. ఆయన మళ్ళీ ప్రిన్స్‌పాల్‌నే ఎంక్వయిరీ కమిటీని నియమించి వాళ్ళిచ్చే రిపోర్టును తనకు పంపించమంటాడు.

రిపోర్టును పరిశీలించాకే కమిషనర్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ యాక్షన్ తీసుకుంటాడు. ఇదంతా జరగటానికి కనీసం ఐదారు నెలలైనా పడ్తుంది. అందువల్ల సస్పెండ్ చెయ్యాలనే మీ డిమాండ్‌ను వదులుకొండి. అతనితో అపాలజీ చెప్పిస్తాం. గురువులను గౌరవించడం మన సంప్రదాయం. ఆయన మీ గురువు. అతడా మాట అనడం తప్పే. అందుకే దీన్ని లైట్‌గా తీసుకొని అతని అపాలజీని అంగీకరించి ఈ విషయాన్ని ఇంతటితో వదిలెయ్యండి" అన్నాడు రాజగోపాలరావు.

"అతడు మాకు అపాలజీని అందరిముందు చెప్పాలె..." అన్నాడు రమణమూర్తి.

"అందరి ముందంటే?" అన్నాడు రాజగోపాలరావు.

"ఈ కాలేజిలో చదువుకుంటున్న స్టూడెంట్స్ అందరిముందు..." అన్నాడు రమణమూర్తి.

"ఆ ఇన్సిడెంట్ మీ క్లాసురూంలో జరిగింది. కాబట్టి మీ క్లాసు రూంలో మీ క్లాస్ స్టూడెంట్స్ ముందు అపాలజీ చెబుతాడు. అంతేకానీ ఈ కాలేజి స్టూడెంట్స్ అందరి ముందంటే కుదిరే పనికాదు... నామాట వినండి. అపాలజీతో ఈ ఇష్యూనీ క్లోజ్ చేద్దాం" అన్నాడు రాజగోపాల్.

విద్యార్థులందరూ బయటకు వెళ్ళి వాళ్ళల్లో వాళ్ళు మళ్ళీ చర్చించుకున్నారు. అరగంట తర్వాత ప్రిన్స్‌పాల్ రూంలోకొచ్చి "అపాలజీకి మేం అంగీకరిస్తున్నాం సార్!" అన్నారు.

వెంటనే ప్రిన్స్‌పాల్ బలరాములును రమ్మని కబురు చేశాడు.

బలరాములు ప్రిన్స్‌పాల్ రూంలో ప్రవేశించగానే విద్యార్థులందర్నీ బయటకు పంపించాడు.

"మిస్టర్ బలరాములు గారూ! మీకు ఆవేశం చాలా ఎక్కువే... ఇదివరక్కూడా మీమీద చాలా కంప్లెయింట్సొచ్చాయి... కొత్తగా అపాయింటయ్యావు.... ఎక్స్‌పీరియన్స్‌తో కొన్ని విషయాలు నేర్చుకుంటావనుకున్నాను... కానీ ఈరోజు మీరు క్లాసులో ఆ మాట అనడం బాగా లేదు..." అన్నాడు ప్రిన్స్‌పాల్.

"కానీ వాళ్ళు క్లాసులో ఎంత గొడవ చేశారో... నన్నెంత హరాస్ చేశారో..." బలరాములు పూర్తి చెయ్యకుండానే

"వాళ్ళెంత హరాస్ చేస్తున్నా మీరా అన్‌పార్లమెంటరీ భాష వాడకూడదు. వాళ్ళు క్లాసులో గొడవ చేస్తే నాకు రిపోర్టు చెయ్యాలి" అన్నాడు ప్రిన్స్‌పాల్.

"మీకు చాలాసార్లు రిపోర్టు చేశాను. ఫలానా విద్యార్థి నా క్లాసులో కావాలని గొడవ చేస్తున్నాడని మీకు రిటెన్ కంప్లెయింట్ కూడా ఇచ్చాను. మీరేం యాక్షన్ తీసుకోలేదు. మీరేం యాక్షన్ తీసుకోరని కూడా నాకు తెలుసు..." అన్నాడు బలరాములు.

"ఇప్పుడవన్నీ అనవసరం.... ప్రస్తుతం జరగాల్సిందేమిటో ఆలోచిద్దాం" అన్నాడు రాజగోపాలరావు.

"మీరు వాళ్ళకు అపాలజీ చెప్పండి... దాంతో ఈ మ్యాటర్ క్లోజ్ చేద్దాం" అన్నాడు ప్రిన్స్‌పాల్.

"అపాలజీ చెప్పడమా? ఆ రౌడీలకు, ఆ గుండాలకు నేను అపాలజీ చెప్పడమా? ఇంపాజిబుల్! నన్ను మీరీ ఉద్యోగంలోంచి తొలగిస్తున్నామని చెప్పినా సరె... నేను అపాలజీ చెప్పను... నేనసలు ఈ దరిద్రపు ఉద్యోగం చెయ్యనే చెయ్యను.

రిజైన్ చేసి వెళ్ళిపోతాను గానీ అపాలజీ చెప్పను. వాళ్ళేం చేసుకుంటారో చేసుకోమనండి" అంటూనే బలరామ్ కూర్చున్న కుర్చీలోంచి దిగ్గున లేచి విసురుగా స్టాఫ్‌రూంలో కెళ్ళిపోయాడు.

"బలరామ్ - డౌన్ డౌన్... విద్యార్థుల్ని కులం పేరుతో దూషించిన బలరామ్‌ను - ఉద్యోగంలోంచి తొలగించాలి" అన్న నినాదాలు మిన్నుముట్టాయి.

"మనమిక చెయ్యగల్గిందేమీ లేదు. ఎంక్వైరీ కమిటీని నియమించండి" అన్నాడు రాజగోపాలరావు.

"అలాగే" అన్నాడు ప్రిన్స్‌పాల్.

* * *

ఆ మర్నాడు ఆ ఊరి పోలీస్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ ప్రిన్స్‌పాల్‌కు ఫోన్ చేశాడు.

"హాలో సి.ఐ. గారు" అన్నాడు ప్రిన్స్‌పాల్.

"హలో ప్రిన్స్‌పాల్ గారూ! మీ కాలేజి స్టూడెంట్ రమణమూర్తి మీ కాలేజిలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేసే ఎన్. బలరాములు అనే ఆయన మీద కులం పేరుతో దూషించాడని ఎస్.సి., ఎస్.టీ. అట్రాసిటీ కేసు క్రింద కంప్లెయింటిచ్చాడు సార్! బలరాములును మేం అరెస్ట్ చేసి విచారించవలసి ఉంటుంది. మాముందే రమణమూర్తిని బలరాములు కులం పేరుతో దూషించాడని పదిమంది మీ కాలేజి విద్యార్థులు సాక్ష్యం చెప్పారు. మేమతన్ని అరెస్ట్ చెయ్యవలసి ఉంటుంది సార్! ఈ విషయంలో మీరు చెప్పాల్సిందేమన్న ఉందా సార్!" అన్నాడు సీ.ఐ.

"యేమీ లేదు. మేమా సమస్యను మా లెవెల్లోనే పరిష్కరించడానికి ప్రయత్నించాం. కానీ మా ప్రయత్నం ఫలించలేదు. కాబట్టి మేం చెయ్యగల్గిందేమీ లేదు. లెట్ ద లా టేక్ ఇట్స్ వోన్ కోర్స్" అన్నాడు ప్రిన్స్‌పాల్.

ఎవరో వెళ్ళి బలరాములుకు "మీమీద అరెస్ట్ వారెంట్ ఇష్యూ కాబోతున్నద"ని చెప్పారు.

యాంటీ ఎస్.సీ. ఎస్.టీ. అట్రాసిటీ కేసు కింద రమణమూర్తి మీమీద కంప్లెయింట్ ఇచ్చాడట" అని కూడా చెప్పారు.

ఈ వార్త వినగానే బలరాములులో వణుకు ప్రారంభమైంది. బయటకు గంభీరంగానే కనిపించాలని ప్రయత్నం చేశాడు.

"వెంటనే మీరెక్కడికైనా వెళ్ళిపొండి. అరెస్టయ్యారంటే మీ ఉద్యోగం పోతుంది. ఈ కేసులో మీకు వెంటనే బెయిల్ కూడా దొరక్కపోవచ్చు. 24 గంటలకు పైగా

మీరు లాకప్‌లో ఉన్నారంటే సస్పెండవుతారు" స్టాఫ్‌రూంలో ఉన్న మరో కామర్స్ లెక్చరర్ రామ్‌నారాయణ్ చెప్పాడు.

బలరాములు వెంటనే చదువుతున్న పుస్తకాన్ని తన డెస్క్‌లో సర్దేసి లేచి బయటకెళ్ళిపోయాడు.

* * *

ఆ ఊర్లో ఉన్న దళిత నాయకులందరికీ విషయం తెలిసింది.

దళిత నాయకులందరూ సమావేశమయ్యారు.

మీడియాక్కూడా ఈ వార్త తెలిసింది. "కులం పేరుతో విద్యార్థిని దూషించిన ఆచార్యుడు" "కులం చేవచావని ఆచార్యుడు" "కులం పేరుతో దూషించిన గురువుకు పంగనామాలు పెట్టిన శిష్యులు" "పాఠాలు చెప్పడానికి అనర్హుడైన అధ్యాపకున్ని వెంటనే ఉద్యోగంలోంచి తొలగించాలని డిమాండ్ చేసిన దళిత నాయకులు". ఇలా రకరకాల శీర్షికలతో పత్రికలు ఈ వార్తను ప్రచురించాయి. టీవి న్యూస్ ఛానెళ్ళవాళ్ళు రమణమూర్తిని ఇంటర్వ్యూ చేశారు. ఆయనకసలు పాఠాలే చెప్పరాదని, షార్ట్‌టెంపర్డ్ ఫెల్లో అనీ నోరు తెరిస్తే బూతులే వెలువడ్తాయనీ, అతన్ని కఠినంగా శిక్షించాలని రమణమూర్తి చెప్పాడు. పోలీసు సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్‌ని టీ.వీ. వాళ్ళు ఇంటర్వ్యూ చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నామనీ, నిందితుడు పరారీలో ఉన్నాడని, ఇవ్వాళ్ళో రేపో అతన్ని పట్టుకొని అరెస్టు చేస్తామని సీ.ఐ. చెప్పాడు. కాలేజి ప్రిన్స్‌పాల్‌ను కూడా టీ.వీ. వాళ్ళు చూపించారు. "చిన్న విషయమే. దురదృష్టవశాత్తు చాలా పెద్దదైందని ఆయన చెప్పారు. కొందరు విద్యార్థులు కూడా టీ.వీలో కనిపించారు. "బలరాములు అసమర్థుడైన లెక్చరర్ అనీ, ఆయనకు నోరు పెగలదని, ఉచ్చారణలో స్పష్టత ఉండదని, మాట మాటకు తట్టుకుంటాడనీ, చాలా చిన్న విషయానిక్కూడా కోపగించుకుంటాడని, కోపమొస్తే బూతు మాటలు ఆయన నోటివెంట ప్రవాహంలా వెలువడ్తాయనీ, రమణమూర్తిని కులం పేరుతో నిందిస్తూ బూతులు తిట్టాడనీ విద్యార్థులందరూ చెప్పేశారు.

బలరాములు మెడచుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నదనీ, అతన్ని ఉద్యోగంలోంచి తొలగించటం ఖాయమనీ, అతనికి జైలు శిక్షకూడా పడ్తుందనీ ఆ కాలేజీలో పనిచేస్తున్న లెక్చరర్లు, విద్యార్థులూ అనుకున్నారు. రమణమూర్తిని ఇవ్వాళో రేపో పోలీసులు పట్టుకుంటారనీ, లేక అతడే సరెండరవుతాడనీ, అతడు ఆంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నాడనీ అందరూ చెప్పుకోసాగారు.

"పూర్ ఫెల్లో... గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నాడు" అన్నాడు రాజగోపాలరావు స్టాఫ్‌రూంలో ఆమర్నాడు.

"అతనిలో అహం చాలా ఎక్కువ సార్... ఒడ్డూ పొడుగు ఉన్న శరీరాన్ని చూసుకొని మురుస్తాడు... ఈ స్టాఫ్‌రూంలో కూడా చాలాసార్లు దురుసుగా ప్రవర్తించాడు. మీరే చాలాసార్లు అతన్ని కాపాడారు. లేకపోతే మేమెప్పుడో అతన్ని కాలేజి నుండి పంపించేవాళ్ళం" అన్నాడు రామ్‌నారాయణ్.

"ఇప్పుడు కూడా అతన్ని మీరు కాపాడ్తారా సార్!" అన్నాడు ఆనందం.

"అతన్నిప్పుడు భగవంతుడు కూడా కాపాడలేడు" అన్నాడు రాజగోపాలరావు.

అలా స్టాఫ్‌రూంలో చాలాసేపు బలరాములును గూర్చిన చర్చ జరిగింది. అందరూ ఇది అతని స్వయంకృతాపరాధమే అన్నారు.

* * *

ఆరోజు రాత్రి పదిగంటలకు రాజగోపాలరావు టీవీలో వార్తలు చూసి పడుకోవడానికి సిద్ధపడ్తుండగా కాలింగ్‌బెల్ మోగింది.

"ఇంత రాత్రి ఎవరొచ్చి ఉంటారబ్బా!" అనుకుంటూ అతడు అతనింటి మెయిన్ డోర్ తలుపులు తెరిచాడు. బయట బలరాములు, అతని భార్య సుజాత నిల్చొని ఉన్నారు.

"నువ్వా బలరాములు! సుజాతను కూడా తీసుకొచ్చావా? లోపలకు రండి" అన్నాడు రాజగోపాలరావు.

వాళ్ళిద్దరు వెంటనే లోపలకొచ్చారు.

రాజగోపాలరావు తలుపులు మూసేసి గడియ పెట్టేశాడు.

"కూర్చోండి" అన్నాడు.

హాల్లో ఉన్న సోఫాల్లో వాళ్ళిద్దరు కూర్చున్నారు.

రాజగోపాలరావు వాళ్ళకెదురుగా ఉన్న మరో సోఫాలో కూర్చున్నాడు.

"యేమిటి విషయం?" అన్నాడు బలరాములుకేసి చూసి.

బలరాములు భార్య సుజాత దిగ్గున లేచి రాజగోపాలరావు దగ్గరకొచ్చి అతని కాళ్ళమీద పడిపోయింది.

"ఇదేం పని సుజాతా!" అన్నాడు ఆమె చేసిన పనితో దిగ్భ్రాంతికి గురయిన రాజగోపాలరావు.

"ఈ ప్రమాదం నుండి మీరే మమ్మల్ని రక్షించాలి సార్!" అందామె.

"కేసు చాలా కాంప్లికేటయిపోయింది. ఇప్పుడు ఎవరూ యేం చెయ్యలేరు. 'సారీ' అంటే పోయేదాన్ని అతడే ఇంత దూరం తెచ్చుకున్నాడు" అన్నాడు రాజగోపాల్.

"ఆయన ఈగో చాలా పెద్దది సార్! నేను మీ స్టూడెంట్‌ని. నా మొఖం చూసి ఆయన్ను రక్షించండి సార్!" అంది సుజాత.

ఐదారేళ్ళ క్రితం సుజాత ఇప్పుడు రాజగోపాలరావు పనిచేస్తున్న కాలేజిలోనే బి.కామ్. చదివింది. రాజగోపాలరావు ఆమెకు పాఠాలు చెప్పాడు.

"ఔను... నువ్వు నా స్టూడెంట్‌వి. చాలా తెలివైన దానివి. నెమ్మదస్తురాలివి. నీ మొఖం చూసే ఇతనికి ఎన్నోసార్లు అడ్డమొచ్చాను. టీచింగ్ ప్రొఫెషన్‌లో ఉన్నవాడికి చాలా ఓపికుండాలనీ, విద్యార్థుల్ని తన కన్న బిడ్డల్లా చూసుకోవాలని చెప్పాను. ఇతడేమో ఇదో దరిద్రపు ప్రొఫెషన్... ఈ జాబ్‌లో నేనింకెంతో కాలం ఉండను. నాకు పోలీసు ఉద్యోగం వస్తుంది. ఈ జాబ్‌కు రిజైన్ చేసి వెళ్ళిపోతాను అంటుండేవాడు. ఈ కేసులో కూడా నేనితన్ని కాపాడటానికి ప్రయత్నించాను. కానీ..."

"నన్ను క్షమించండి సార్! వాళ్ళు ఇంతదూరం పోతారనుకోలేదు. రెండ్రోజులు గొడవ చేసి ఊరుకుంటారనుకున్నాను. మీరే నన్ను కాపాడాలి సార్... మీరు తల్చుకుంటే నన్ను కాపాడగలరని మా సుజాత పదేపదే చెప్పి నన్నిక్కడకు తీసుకొచ్చింది" అన్నాడు బలరాములు రాజగోపాలరావు చేతులు పట్టుకుంటూ.

"పోలీసులు కేసు రిజిష్టర్ చేశాక నేనేం చెయ్యగలను బలరాములు..." అన్నాడు రాజగోపాలరావు.

"నేను తెలుసుకున్నాను సార్.... కంప్లెయింటిచ్చినట్టు రాసుకున్నారే తప్ప ఇంకా కేసు రిజిష్టర్ చెయ్యలేదు... చార్జ్‌షీటు తయారు కాలేదు." అన్నాడు బలరాములు.

"మీపట్ల విద్యార్థులకెంత గౌరవం ఉందో నాకు తెలుసు సార్. రమణమూర్తి మీమాట వింటాడు. బలరాములు విద్యార్థులందరి ముందు క్షమాపణ చెబుతాడు. కొంత పెనాల్టీ వేసినా చెల్లిస్తాడు. మీరు రమణమూర్తిని పిలిచి మాట్లాడండి సార్" అంది సుజాత.

"ఇప్పుడీ కేసు ఒక్క రమణమూర్తి చేతుల్లో లేదు. ఈ ఊరి దళిత నాయకులందరూ ఇన్‌వాల్వయ్యారు" అన్నాడు రాజగోపాల్.

"దళిత నాయకులక్కూడా మీరంటే చాలా గౌరవముంది సార్... వాళ్ళతో కూడా మీరు మాట్లాడి ఈ ఇష్యూను క్లోజ్ చేయించండి సార్" అంది సుజాత.

"నామీద కోర్టులో చార్జిషీటు దాఖలైతే నా జీవితం నాశనమైపోతుంది సార్. నాకు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది సార్... దానికి సంబంధించిన ఫిజికల్ టెస్టులన్నీ ప్యాసయ్యాను... రిటెన్ ఎగ్జామ్ కూడా బాగానే రాశాను. నాకీ జాబ్ దొరికే ఛాన్సెస్ చాలా బ్రైట్‌గా ఉన్నాయి సార్... కానీ ఈ కేసులో నుండి నేను క్షేమంగా బయటపడకపోతే నాకా జాబ్ రాదు సార్... మీరు చొరవ తీసుకొని రమణమూర్తితో మాట్లాడండి సార్... దళిత నాయకులతో కూడా మాట్లాడండి సార్... వాళ్ళేం చెయ్యమంటే అది చేస్తాను... ఈ కేసు కోర్టుకు మాత్రం వెళ్ళకూడదు సార్... ప్లీజ్ సార్! జన్మజన్మల వరకు మీకు ఋణపడి ఉంటాను సార్.... మీరు తప్ప నన్నీ ప్రమాదం నుండి ఎవరూ కాపాడలేరు సార్... చాలా పొరపాటు చేశాను. అప్పుడే మీమాట విని సారీ అంటే ఇంతదాకా వచ్చేది కాదు సార్... నన్ను రక్షించండి సార్!" అంటూనే బలరాములు కూడా రాజగోపాలరావు కాళ్ళు పట్టుకున్నాడు. అతని కళ్ళవెంట ధారాపాతంగా కన్నీళ్ళు!

"ఛీఛీ! ఇదేమిటి బలరాములు... లే..." అన్నాడు రాజగోపాల్ కంగారు పడిపోతూ, అతని భుజాలు పట్టుకొని అతన్ని లేపడానికి ప్రయత్నిస్తూ.

"మీరు రమణమూర్తితో మాట్లాడ్తానని మాటిచ్చేదాకా మేం మీ కాళ్ళని పదలం సార్" అన్నారు వాళ్ళిద్దరు... సుజాత కూడా రాజగోపాల్ కాళ్ళమీద పడిపోయింది.

"నేను రమణమూర్తితో మాట్లాడ్తాను. మీరు లేవండి" అన్నాడు రాజగోపాల్ కాస్సేపు ఆలోచించి.

వాళ్ళిద్దరూ లేచి నిల్చున్నారు.

"మీరెలా చెప్తే అలా చేస్తాను సార్! వాళ్ళకు సారీ చెప్పమంటే చెబుతాను. ఎంత పెనాల్టీ చెల్లించమన్నా చెల్లిస్తాను.... దయచేసి నన్ను కాపాడండి సార్!" అన్నాడు బలరాములు.

"మీరిక వెళ్ళండి. రేపే నేను రమణమూర్తితో మాట్లాడ్తాను" అన్నాడు రాజగోపాల్.

వాళ్ళిద్దరు మరోసారి రాజగోపాల్‌కు నమస్కారం చేసి వెళ్ళిపోయారు.

* * *

ఆ మర్నాడు రాజగోపాల్ రమణమూర్తికి కబురుచేసి తనింటికే రమ్మన్నాడు.

సాయంత్రం ఐదు గంటలకు రమణమూర్తితో బాటు సంతోష్‌కుమార్, మరికొందరు విద్యార్థులు రాజగోపాలరావు ఇంటికొచ్చారు.

బలరాములు క్లాసులో ఎన్నిసార్లు వాళ్ళను తిట్టాడో చెప్పారు. లెక్చరర్‌గా అతడు అనర్హుడన్నారు. అతన్ని జైల్లో పెట్టాల్సిందేనన్నారు. ఆవేశంతో ఊగిపోతూ మాట్లాడారు.

రాజగోపాలరావు వాళ్ళు చెప్పిందంతా విన్నాడు. అతడు లెక్చరర్ ఉద్యోగానికి సరిఅయినవాడు కాదన్న వాళ్ళ అభిప్రాయంతో ఏకీభవించాడు. త్వరలోనే అతడీ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోతాడన్నాడు.

"అతన్ని జైళ్ళో పెడ్తే మీకేమొస్తుంది?" అని అడిగాడు.

"అతని కారణంగా ఎందరో విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. సరిగ్గా చెప్పకపోవడం వల్ల విద్యార్థులకు పాఠాలు అర్థం కావడం లేదు. అలా వాళ్ళెంతో నష్టపోతున్నారు. అతని నోరు కూడా మంచిది కాదు. నోటికొచ్చినట్టుగా తిడ్తూ ఎంతోమంది విద్యార్థుల మనోభావాలను గాయపరుస్తున్నాడు. కాబట్టి అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాల్సిందే..." అన్నాడు సంతోష్‌కుమార్.

"అతడే త్వరలో ఈ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్ళిపోయేలా చేద్దాం. అలాగే అతడు మీకు బహిరంగ క్షమాపణ చెబుతాడు. నామాట విని మీరు కేసు విత్‌డ్రా చేసుకొండి" అన్నాడు రాజగోపాల్.

"సార్ ఇంతగా చెబుతున్నప్పుడు వింటేనే మంచిదేమోరా రమణ" అన్నాడు సంతోష్‌కుమార్.

రమణమూర్తి కాస్సేపు ఆలోచించాడు. "మీరంటే మాకు చాలా గౌరవం సార్! దేవుడు ఎక్కడో లేడు. మిమ్మల్ని చూస్తే మీరే దేవుడనిపిస్తారు. అలాంటి మీరు చెప్పాక వినకపోవడమేమిటి? కానీ ఇది నా ఒక్కడి చేతిలో లేదు.... ఈ ఊర్లో ఉన్న దళిత నాయకులందరూ అతనికి శిక్షపడాల్సిందే అంటున్నారు... వాళ్ళను కాదని..." అన్నాడు రమణమూర్తి.

"నేను వాళ్ళతో కూడా మాట్లాడ్తాను. రేపు వాళ్ళందర్నీ ఇక్కడే మా ఇంట్లోనే సమావేశ పరుద్దాం" అన్నాడు రాజగోపాలరావు.

ఆ మర్నాడు రమణమూర్తి ఆ ఊరి దళిత నాయకులతోబాటు అనేక మంది ఇతర రాజకీయ పార్టీల నాయకుల్ని కూడా రాజగోపాలరావు గారింట్లో సమావేశ పరచాడు.

ఐదారుగంటలసేపు తర్జనభర్జనలు జరిగాయి.

క్షమాపణతో వదిలేయకూడదని, లక్ష రూపాయల జుర్మానా చెల్లిస్తే వదిలేద్దామన్నారు చాలామంది నాయకులు.

రాజగోపాలరావు చాలా ఓపిగ్గా వాళ్ళ మాటల్ని విన్నాడు. లక్ష రూపాయలు చెల్లించే ఆర్థిక స్తోమత అతనికి లేదన్నాడు. పదివేలతో అతన్ని క్షమించి వదిలేయండన్నాడు. 50 వేలకు తగ్గేది లేదన్నారు వాళ్ళు. చివరకు పాతికవేల పెనాల్టీని రమణమూర్తికి చెల్లించడం, బహిరంగ క్షమాపణ చెప్పించడం – ఈ రెండు పనులు అతనితో చేయిస్తే రమణమూర్తిచ్చిన పోలీసు కంప్లెయింటును వాపస్ తీసుకుంటాడన్నారు.

ఈ రెండు పనుల్ని అతనిచేత చేయిస్తానని రాజగోపాల్ వాళ్ళకు మాటిచ్చాడు.

*　　　　*　　　　*

రెండ్రోజుల తర్వాత బలరాములు ఆ కాలేజిలో చదువుకుంటున్న విద్యార్థులందరి సమక్షంలో రమణమూర్తికి క్షమాపణ చెప్పాడు.

వారం రోజుల తర్వాత 25 వేల రూపాయల్ని కూడా చెల్లించాడు. దాంతో రమణమూర్తిచ్చిన కంప్లెయింటును విత్‌డ్రా చేసుకున్నాడు.

ఇది జరిగిన రెండ్రోజులకు బలరాములు, సుజాత రాజగోపాలవింటికొచ్చి కృతజ్ఞతలు చెప్పారు. మీరే మా. దేవుడన్నారు. మీరు చేసిన మేలును ఈ జన్మలో మరచిపోలేమన్నారు.

"నాకు కృతజ్ఞతలు చెప్పడం ముఖ్యం కాదు. నువ్వు నీ పద్ధతుల్ని మార్చుకోవడం ముఖ్యం. నీ మాటతీరు మారాలి. ఎవరితోనైనా ఎంత చిన్నవాళ్ళయినా, ఎంత పెద్దవాళ్ళయినా సరె, మర్యాదగా, వినయంగా మాట్లాడటం నేర్చుకోవాలి. రేపు నువ్వు పోలీసాఫీసర్ అవుతావు.... పోలీసాఫీసర్ కాగానే చాలామందికి కళ్ళు నెత్తికెక్కుతాయి. నువ్వలా కాకూడదు.. ప్రజలకు సేవ చెయ్యడం... ముఖ్యంగా పేద ప్రజలకు న్యాయం చెయ్యడమన్నది నీ లక్ష్యం కావాలి... ఓ మంచి పోలీసాఫీసర్ అన్న పేరు తెచ్చుకోవాలి" అన్నాడు రాజగోపాల్.

"నేను లెక్చరర్‌గా ఫెయిలయ్యానుగానీ పోలీసాఫీసర్‌గా తప్పకుండా సక్సెసవుతాను సార్... మీరు చెప్పిన మాటల్ని ఎప్పుడు గుర్తుంచుకుంటాను సార్" అన్నాడు బలరామ్.

"వెళ్ళొస్తాం సార్" అంటూ వాళ్ళిద్దరు వెళ్తూవెళ్తూ బలరాములు చేతిలో ఉన్న ఓ కవర్‌ని టీపాయ్ మీద పెట్టేయటాన్ని రాజగోపాలరావు చూశాడు. "యేమిటా కవర్?" అని చూస్తే దాంట్లో చాలా కరెన్సీ నోట్లు కనిపించాయి. కవరు మీద "టు సర్, విత్‌లవ్! 25,000" అన్న అక్షరాలు కనిపించాయి.

రాజగోపాలరావుకు వెంటనే వాళ్ళు చేసిన పనేమిటో అర్థమయ్యింది.

"బలరాములు!...." అరచినట్టుగా పిలిచాడు రాజగోపాల్.

"సార్!" అంటూ అతడు ఆగిపోయాడు.

"యేమిటిది?" అంటూ కవర్‌ను అతని మీదకు విసిరేశాడు.

"సారీ సార్! యేదో మా సంతోషం కోసం ఇచ్చాం సార్! మేడంకేదన్నా కొనివ్వండి సార్... మమ్మల్ని అపార్థం చేసుకోకండి సార్! మేమే మేడంకు ఓ పట్టుచీర కొనుక్కొని ఇద్దామనుకున్నాం సార్! మేం కొనడానికంటే తనే తనకు నచ్చిన చీరెను కొనుక్కుంటే బావుంటుందని..." సుజాత ఇంకా యేదో చెప్పబోయింది.

"అక్కర్లేదు సుజాత. మీరే పట్టుచీరెలు పెట్టాల్సిన అవసరం లేదు. మీ హృదయంలో కృతజ్ఞతాభావం ఉంటే చాలు" అన్నాడు రాజగోపాలరావు.

"మీరు చేసిన మేలును ఈ జన్మలో మరవలేను సార్... మీ రుణం తీర్చుకోలేను సార్..." అంటూ మరోసారి నమస్కారం చేసి, రాజగోపాల్ విసిరేసిన కవర్‌ని పాయింట్‌జేబులో కుక్కుకుంటూ బలరాములు వెళ్ళిపోయాడు. సుజాత అతన్ని అనుసరించింది.

"పాతికవేల నా పట్టుచీరెను పోగొట్టారు" అంది రాజగోపాల్ భార్య సావిత్రమ్మ లోపలి రూంలోంచి నవ్వుతూ హాల్లోకొచ్చి.

రాజగోపాలరావు కూడా నవ్వుతూ "ఈ ఒక్క పట్టుచీరే కాదు, ఎన్ని పట్టుచీరెల్ని పోగొట్టానో" అన్నాడు.

* * *

ఇది జరిగిన రెండుమూడు నెలల తర్వాత బలరాములుకు పోలీసు సీ.ఐగా సెలక్షన్ వచ్చింది. అతడు నల్గొండ కాలేజి నుండి లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పోలీసు డిపార్ట్‌మెంట్‌లో సీ.ఐగా చేరిపోయాడు.

* * *

చాలా యేళ్ళు గడిచిపోయాయి.

రాజగోపాలరావుకు 58 ఏళ్ళు రావడంతో నల్గొండలోనే ఉద్యోగ విరమణ చేశాడు. హైదరాబాద్‌లో ఒక అపార్ట్‌మెంట్ కొనుక్కొని అక్కడే సెటిలైపోయాడు. అతని కూతురు అర్చన మెడిసిన్ చదువుతూ తల్లిదండ్రులతోనే ఉండిపోయింది. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికాలో సెటిలయ్యాడు. రాజగోపాలరావు స్టూడెంట్స్‌లో ఎవరో ఒకరొచ్చి బలరాములు

ఫలానా చోట సీ.ఐగా పనిచేస్తున్నాడనీ, అతడేమీ మారలేదనీ, అతడు పనిచేస్తున్న పోలీసు స్టేషన్‌కొచ్చే వాళ్ళందరితో చాలా దురుసుగా, అమర్యాదకరంగా మాట్లాడుతున్నాడనీ, విపరీతంగా లంచాలు తీసుకుంటున్నాడని, కోట్లు సంపాదించాడని రాజగోపాల్‌కు చెబుతూనే ఉన్నారు.

రాజ్‌గోపాల్ నవ్వి "కొందరు మనుషుల్ని మార్చడం సాధ్యం కాదేమో" అనేవాడు.

రాజ్‌గోపాల్ భార్య సావిత్రమ్మకు వయస్సు పైబడుతున్నకొద్దీ అనేక ఆరోగ్య సమస్యలెదురయ్యాయి. మోకాళ్ళ నొప్పులొచ్చి ఆమెకు కదల్లేని పరిస్థితి యేర్పడింది. ఇంట్లోనే ఉంటూ వంట చేసిపెట్టే ఓ పనిమనిషి కోసం రాజగోపాలరావు అన్వేషించడం మొదలెట్టాడు. ఒకసారి హైదరాబాద్‌లోనే బ్యాంకు ఉద్యోగిగా పనిచేస్తున్న అతని స్టూడెంట్ సంతోష్‌కుమార్‌కు ఈ విషయం చెప్పాడు.

సంతోష్‌కుమార్ ఒకరోజు ఓ ముప్పైయేళ్ళ స్త్రీని తీసుకొని రాజగోపాలరావు ఇంటికొచ్చాడు.

"మీకు వంటమనిషిని తీసుకొచ్చాను సార్" అన్నాడు సంతోష్ రాజ్‌గోపాలరావుతో.

రాజ్‌గోపాలరావు సంతోష్ తీసుకొచ్చిన ఆ స్త్రీని చూశాడు.

మర్యాదస్తుల కుటుంబానికి చెందిన స్త్రీలాగే కనిపించింది. కట్టుబొట్టు బావున్నాయి. ఆమెను చూడగానే ఎవరికైనా చాలా మంచిది అన్న అభిప్రాయం కల్గుతుంది.

"ఈమెది మాఊరే సార్. రెండేళ్ళ క్రితమే ఈమె భర్త చనిపోయాడు. ఒకప్పుడు బాగా బతికినవాళ్ళే. ఈమెకో ఎనిమిదేళ్ళ కొడుకున్నాడు. వాడిని నేనే ఇక్కడి ఓ ప్రైవేట్ స్కూల్లో చేర్పించాను. ఆ స్కూలు హాస్టల్లో ఉంటూ చదువుకుంటాడు. ఈమె పేరు నిర్మల. ఈమెకు ఇంటి పనులన్నీ వచ్చు. వంట కూడా చాలా బాగా చేస్తుంది. ఈమె కొంతకాలం మా ఊర్లో మా అమ్మానాన్నల దగ్గర పనిచేసింది. చాలా మంచమ్మాయి.... మీకు అన్ని విధాలా ఈమె సహాయకారిగా ఉంటుందని తీసుకొచ్చాను..." అన్నాడు సంతోష్.

"చాలా సంతోషం నాయనా... ఈ కాళ్ళనొప్పులొచ్చి నేనేవనీ చెయ్యలేకపోతున్నాను..." అంది సావిత్రమ్మ.

"మీకిక యే సమస్యా ఉండదు మేడం! మీ ఇంటి పనంతా నిర్మల చూసుకుంటుంది" అన్నాడు సంతోష్.

"ఈమెకు జీతమెంతివ్వాలో నిర్ణయించావా సంతోష్!" అన్నాడు రాజగోపాల్.

"మీరేమిచ్చినా తీసుకుంటాను సార్!" అంది నిర్మల చాలా వినయంగా.

"అలా కాదమ్మా! అన్ని విషయాలు ముందే మాట్లాడుకోవడం మంచిది" అన్నాడు రాజగోపాల్.

"ఈమెకు మూడు పూటలా అన్నం పెట్టి నెలకు రెండువేలివ్వండి సార్! సంతోషంగా మీ ఇంట్లోనే మీ ఫ్యామిలీ మెంబర్‌గా ఉంటూ మీకన్ని పనులు చేసి పెడ్తుంది" అన్నాడు సంతోష్.

"అలాగే... తిండే కాదు... బట్టలు కూడా మేమే పెడ్తాం.... నీకేదన్న అవసరం ఉంటే దాచుకోకుండా అడగాలి నిర్మల... నువ్వు మా ఇంట్లో మా ఫ్యామిలీ మెంబర్ లాగే ఉండాలి" అన్నాడు రాజగోపాల్.

"అలాగే సార్! మిమ్మల్ని నా తల్లిదండ్రులుగా భావించి చూసుకుంటాను" అంది నిర్మల.

నిర్మల వెంటనే పనిలో చేరిపోయింది.

సంతోష్‌కు రాజ్‌గోపాలరావు, సావిత్రమ్మలు థాంక్స్ చెప్పారు.

నిజంగానే నిర్మల ఆ ఇంట్లో వాళ్ళ ఫ్యామిలీ మెంబర్‌లాగే మారిపోయి అన్ని పనులు చెయ్యసాగింది.

*　　　　*　　　　*

ఆరు నెలలు గడిచిపోయాయి.

ఉదయం యేడు గంటలకే వచ్చి రాత్రి పదింటిదాకా ఉండి పనులన్నీ చేసేసి నిర్మల తనింటికి వెళ్ళిపోతుండేది. కొన్నిసార్లు రాజగోపాలరావింట్లోనే పడుకునేది. ఆమెకు ప్రత్యేకంగా ఒక గదిని ఆ ఇంటెనుక ఉన్న ఖాళీ స్థలంలో కట్టించారు.

నిర్మల వచ్చినప్పట్నించి సావిత్రమ్మకు ఎంతో ఉపశమనం లభించింది.

"సంతోష్ మనకు చాలా సహాయం చేశాడండి" అని ఆమె భర్తతో చాలా సార్లంది.

నిర్మల పనిలో చేరిన మూడు నెలల తర్వాత సావిత్రమ్మకు నిర్మల తను ఊహించుకుంటున్నంత మంచిది కాదేమోనన్న అనుమానం కల్గింది. అప్పుడప్పుడు చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నదేమో అనిపించింది. బియ్యం, కందిపప్పు, చెక్కెర, చింతపండు మొదలైన వాటిని తమ కళ్ళుగప్పి తనింటికి చేరవేస్తూన్నదేమో అనుకుంది.

ఈ విషయం ఆమె భర్తతో చెబితే "నీవన్నీ లేనిపోని అనుమానాలు. బాగా పనిచేస్తున్నది. చాలా మంచమ్మాయి అని నువ్వే చెప్పావుగా... చిన్నచిన్న దొంగతనాలు చేసినా పట్టించుకోకు... ఇన్ని పనులు చేసిపెట్టే వాళ్ళెవరూ మళ్ళీ దొరకరు" అన్నాడు రాజగోపాలరావు.

ఆరునెలలు గడిచాక ఒకరోజు ఉదయం రాజగోపాలరావు పాంట్‌జేబు సీక్రెట్ పాకెట్‌లో దాచిపెట్టిన 10 వేల రూపాయల క్యాష్ దొంగిలిస్తూ నిర్మల రాజగోపాలరావుకే దొరికిపోయింది.

అప్పుడు నిర్మల రాజగోపాలరావు బెడ్‌రూం ఊడుస్తోంది.

ఆ టైమ్‌లో రాజగోపాలరావు, సావిత్రమ్మ వాళ్ళింటి బాల్కనీలో కూర్చొని పేపర్ చదువుతున్నారు. వాళ్ళ కూతురు అర్చన బాత్‌రూంలో స్నానం చేస్తోంది. ఆ టైమ్‌లో బెడ్‌రూంలోకి వాళ్ళు రారన్న నమ్మకంతో నిర్మల రాజగోపాలరావు ప్యాంట్ జేబులు వెతకసాగింది. అంతకు ముందురోజే రాజగోపాలరావు ఎ.టి.యం.కు వెళ్ళి తన పెన్షన్ డబ్బులు తీసుకొని సీక్రెట్ పాకెట్‌లో పెట్టుకున్నాడు. వాటిని తీసి వేరేచోట పెట్టుకోవడం మరచిపోయాడు.

టాయిలెట్‌కు వెళ్ళాల్సిన అవసరం పడి రాజగోపాలరావు పేపర్ పక్కన పెట్టేసి బెడ్‌రూంలో ఉన్న అటాచ్డ్ బాత్‌రూంలో కెళ్ళడానికొచ్చాడు. సరిగ్గా అప్పుడే నిర్మల ప్యాంట్ జేబులోంచి డబ్బులు తీస్తూ కనిపించింది.

"అదేం పని నిర్మలా?" అన్నాడు రాజగోపాల్. నిర్మల ఉలిక్కిపడింది.

"యేం లేదండి... డబ్బులు కిందపడ్తే తీసి మళ్ళీ మీ జేబులో పెడ్తున్నాను" అంది నిర్మల.

"జేబులో పెట్టడం లేదు. జేబులోంచి తీస్తున్నావు... నీకు డబ్బు అవసరమని అడిగితే మేమే ఇచ్చేవాళ్ళం కదా... ఇలా దొంగతనం చెయ్యడం బాగాలేదు నిర్మలా!" అన్నాడు రాజగోపాలరావు చాలా శాంతంగా.

అతని మాటలు విన్న నిర్మల ఆవేశంతో రెచ్చిపోతూ చాలా దురుసుగా మాట్లాడింది.

"నేను... నేను... దొంగతనం చేశానా? నామీద ఇంత ఘోరమైన అభాండం వేస్తారా? ఆరునెల్ల నుండి రాత్రింబవళ్ళు మీకు చాకిరి చేస్తున్నందుకు ఫలితం ఇదా? మీరు పెద్ద మనుషులు.... మంచివాళ్ళు అనుకున్నాను... నేను చాలా మంది ఇళ్ళల్లో పనిచేశాను. నావేపు వేలెత్తి చూపించినవాళ్ళు లేరు.... నిప్పులాంటి మనిషిని నేను...

నేనిక మీ ఇంట్లో ఒక్కక్షణం కూడా ఉండను. డబ్బున్నవాళ్ళందరూ ఇంతే... పేదవాళ్ళందరూ మీ కంటికి దొంగల్లా, దుర్మార్గులుగా కనిపిస్తారు. నీ భార్యకూడా నన్ను రెండుమూడు సార్లు అనుమానించింది. బియ్యం తక్కువున్నాయి, పప్పు తక్కువుంది. అంటూ రాగాలు తీసింది. చిన్న విషయాలని వాటిని పట్టించుకోలేదు. నువ్వేమో నేను దొంగతనం చేశాననే అంటున్నావు... అవసరమయితే డబ్బిచ్చేవాడిని కదా అంటున్నావు... దేనికి డబ్బిస్తావు? నన్ను లొంగదీసుకొని అనుభవించడానికా? నీకు నీ భార్యతో సుఖం లేదు. జబ్బుమనిషి. అందుకే నామీద కన్నేసి డబ్బిస్తానంటున్నావు" అంటూ నిర్మల పెద్దగా అరవసాగింది.

ఆమె మాటలు విని అతడు స్తంభించిపోయాడు. అతని తల తిరిగిపోయింది.

"నిర్మలా! యేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తున్నదా? పిచ్చిగా మాట్లాడుతున్నావు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలెయ్. నువ్వు దొంగతనం చెయ్యడానికి ప్రయత్నించావని మేం ఎవరితోనూ చెప్పం... దయచేసి పిచ్చిగా అరవకు" అన్నాడతడు సాధ్యమైనంత అనునయంగా.

"నువ్వు చెప్పవు... కానీ నేను చెబుతాను. నువ్వేం చేశావో నేను అందరికీ చెబుతాను... నీ సంగతి, నీ పెళ్ళాం సంగతి, నీ కూతురు సంగతి... మీ అందరి సంగతి చూస్తాను..." అంటూనే నిర్మల ఆమెకు కేటాయించిన రూంలోకెళ్ళి తన బ్యాగ్ సర్దుకొని పెద్దగా అరుస్తూ బయటకెళ్ళిపోయింది.

"యేమైందండీ?" అని అడుగుతున్న సావిత్రికి యేమని సమాధానం చెప్పాలో అతనికర్థం కాలేదు. అతడి బుర్ర గిర్రున తిరిగిపోసాగింది. నిర్మల అన్న మాటలు అతని చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి. ఆ షాక్ నుండి తేరుకోవడానికి అతనికి చాలా టైమ్ పట్టింది.

ఓ గంటసేపు గడిచాక రాజగోపాలరావు సంతోష్‌కుమార్‌కు ఫోన్‌చేశాడు. నిర్మల యేం చేసిందో చెప్పాడు.

"నిర్మలా అంత ఘోరంగా ప్రవర్తించిందా? షాకింగ్!" అని అతడు చాలా ఆశ్చర్యపడ్డాడు. "బయటికెళ్ళి రోడ్డుమీద కూడా అరిచిందా? మీ ఇంటి చుట్టుపక్కల వాళ్ళక్కూడా యేమన్నా చెప్పిందా?" అని అడిగాడు.

"అరచుకుంటూ వెళ్ళిందేగానీ మా ఇంటి చుట్టుపక్కల వాళ్ళకేమీ చెప్పలేదు.... కానీ ఆమె ఇంకేదన్నా మిస్చీఫ్ చేస్తుందేమోనని అనుమానంగా ఉంది సంతోష్!"

"డోన్ట్‌వర్రీ సర్... నేనామెతో మాట్లాడ్తాను. ఆమె తల్లిదండ్రులూ, ఆమె అన్నదమ్ములు... అందరూ నాకు తెలుసు... ఆమెది మా ఊరేనని మీకు తెలుసుకదా... రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయానని... మీ డబ్బును మళ్ళీ యధాస్థానంలో పెట్టేశాను కదా అని మీరు చూసీ చూడనట్టుండక దొంగతనం చేస్తావా? అని అడగటంతో చాలా హర్టయిపోయుంటుంది. తాత్కాలిక ఆవేశంలో అలా వాగి ఉంటుంది లెండి... అలా వాగేయటంతో దాని అక్కసంతా తీరిపోయుంటుంది. ఇంకేం చెయ్యదులెండి. మీరు వర్రీ కాకండి సార్... నేనీరోజే ఆమెతో మాట్లాడ్తాను... ఈ సమస్యను నాకొదిలేయండి..." అన్నాడు సంతోష్.

సంతోష్‌తో మాట్లాడాక రాజగోపాలరావు హృదయం కొంత శాంతించింది. "అంతా సంతోష్ చూసుకుంటాడులే" అనుకున్నాడు.

* * *

రెండ్రోజుల తర్వాత... రాజగోపాలరావు మధ్యాహ్న భోజనం చేసి కాస్సేపు పడుకోవడానికి సిద్ధమవుతుండగా టెలిఫోన్ మోగింది.

"ఎవరై ఉంటారబ్బా!" అనుకుంటూ రాజగోపాల్ రిసీవర్ ఎత్తాడు.

"హలో" అన్నాడు.

"రాజగోపాలరావేనా మాట్లాడేది" అవతలి కంఠం.

"అవును..."

"నేను జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ సి.ఐని మాట్లాడుతున్నాను... మీమీద లైంగిక వేధింపుల చట్టం కింద మీ ఇంట్లో పనిచేసిన నిర్మల అనే ఆమె కంప్లెయింటిచ్చింది..."

"యేమని?"

"అవన్నీ మీరు ఈరోజు సాయంత్రం ఆరుగంటలకు పోలీసు స్టేషన్‌కొచ్చినప్పుడు చెబుతాం... ఆమె మీమీద, మీ భార్యమీద, మీ కూతురుమీద - మీ ముగ్గురి మీద కంప్లెయింటిచ్చింది.... సాయంత్రం యేడు గంటలకు మీరు ముగ్గురు పోలీసు స్టేషన్‌కు రావలసి ఉంటుంది" అంటూనే అతడు ఫోన్ పెట్టేశాడు.

రాజగోపాలరావు శరీరమంతా చెమటతో నిండిపోయింది.

"ఫోన్ చేసిందెవరండీ!" అని సావిత్రమ్మ అడిగింది.

"జూబ్లీహిల్స్ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్..."

"సర్కిల్ ఇన్‌స్పెక్టరా?"

"నిర్మల మనమీద కంప్లెయింటిచ్చిందట.... మన ముగ్గర్ని పోలీసు స్టేషన్‌కు రమ్మంటున్నాడు"

"సంతోష్ బలేదాన్ని తెచ్చి మనింట్లో పెట్టాడు. అదంత పని చేస్తుందని నేననుకుంటూనే ఉన్నాను.... ఇప్పుడేం చేద్దాం?" అంది సావిత్రమ్మ వణికిపోతూ.

"సంతోష్‌కు చెబుదాం" అంటూనే రాజగోపాలరావు సంతోష్‌కు ఫోన్ చేశాడు.

"మైగాడ్! నిర్మల మీమీద పోలీసు కంప్లెయింటిచ్చిందా? నిన్ననే దాంతో మాట్లాడాను. మీమీద పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తే దాన్ని బాగా తిట్టాను. సిటీలో ఎవరింట్లోనన్నా పనిమనిషిగా ఉద్యోగమిప్పిస్తే నా కొడుకును చదివించుకుంటానని నా కాళ్ళావేళ్ళా పడ్తే దాన్ని మీ ఇంటికి తీసుకొచ్చాను సార్... అదింత పని చేస్తుందని కలలో కూడా ఊహించలేదు. యే పోలీసు స్టేషన్లో కంప్లెయింటిచ్చిందది!" అన్నాడు సంతోష్.

"జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్లో"

"జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్లోనా? అయితే ఫరవాలేదు..." అన్నాడు సంతోష్.

"ఎందుకు ఫరవాలేదంటున్నావు?"

"అక్కడ సీ.ఐగా పనిచేస్తున్నదెవరనుకుంటున్నారు?..."

"ఎవరు?"

"బలరాములు... ఒకప్పటి మీ కొలిగ్ బలరాములు... మీరతనికి చాలా సహాయం కూడా చేశారు"

"బలరాములా? అతడిప్పుడిక్కడకొచ్చాడా?"

"అవును సార్!"

"అయితే నిన్న నాతో ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి బలరాములేనా? ఇతని కంఠం ఎక్కడో విన్నట్టుగా ఉందే అనుకున్నాను... రాజగోపాలరావంటే మీరేనా? అన్నాడు. నేనతనికి తెలియనట్టే మాట్లాడాడే?"

"పోలీసువాళ్ళు అలాగే మాట్లాడ్తారు సార్... అందులో బలరాములు సంగతి మీకు తెలీదా? పోలీసు ఉద్యోగంలో చేరాక అతని కళ్ళు మరీ నెత్తికెక్కాయి... అందరితోనూ చాలా దురుసుగా, అమర్యాదగా మాట్లాడుతున్నాడట... మీరతనికి చేసిన మేలును కూడా మరచిపోయాడేమో... నేనతనితో మాట్లాడ్తానుండండి... మీరు చేసిన ఉపకారాన్ని అతనికి గుర్తు చేస్తాను..."

"ఆమె నా ఒక్కడి మీదనే కాదు... నా భార్యమీద, కూతురి మీద కూడా కంప్లెయింటిచ్చిందట... మా ముగ్గుర్ని పోలీసు స్టేషన్‌కు రమ్మన్నాడు"

"వాడికేమన్నా బుద్ధుందా? ఆడవాళ్ళని పోలీసు స్టేషన్‌కు రమ్మంటాడా... నేనిప్పుడే అతనితో మాట్లాడి మీకు ఫోన్ చేస్తాను" అంటూ సంతోష్ ఫోన్ పెట్టేశాడు.

అరగంట తర్వాత సంతోష్ మళ్ళీ ఫోన్ చేశాడు.

"నేనతనితో మాట్లాడాను సార్! అతనికి రాజగోపాలరావంటే మీరేనని తెలుసు. అయినా గుర్తుపట్టినట్టుగా ఎందుకు మాట్లాడలేదని అడిగితే ఆయన మీద కంప్లెయింటొచ్చింది కదా. నేను గుర్తు పట్టినట్టుగా ఉండకూడదు అన్నాడు. అయితే ఈరోజు సాయంత్రం మీరొక్కరే వస్తే చాలన్నాడు. మేడమ్, అర్చన అక్కర్లేదు. మీతో నేను కూడా వస్తాను. ఒకందుకు మీరు ప్రిపేర్ కావాలె సార్! అతడు మీతో పోలీసు స్టేషన్లో కూడా దురుసుగానే ప్రవర్తిస్తాడు. యేం జరిగిందో చెప్పండి. ఎంక్వైరీ చేసుకోమనండి... అవసరమనుకుంటే మనం హైయర్ అఫీషియల్స్‌ని కూడా కలుద్దాం... మీవెంట నేనున్నాను సార్... వర్రీ కాకండి..." అన్నాడు సంతోష్.

* * *

ఆరోజు సాయంత్రం యేడింటికి సంతోష్‌తో కలిసి అతని కార్లోనే రాజగోపాలరావు పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు.

అక్కడున్న ఎస్.ఐ "సీ.ఐ. గారింకా రాలేదు సార్... మీరు కూర్చోండి సార్" అన్నాడు రాజగోపాలరావుతో చాలా మర్యాదగా. ఎస్.ఐ. గదిలో ఉన్న రెండు కూర్చీల్లో రాజగోపాలరావు, సంతోష్‌కుమార్ కూర్చున్నారు.

అరగంట తర్వాత సీ.ఐ. బలరాములు స్టేషన్‌కొచ్చి తన గదిలో కూర్చున్నాడు. సంతోష్ వెళ్ళి అతన్ని కలిసి

"సారొచ్చారు. రమ్మంటారా?" అన్నాడు.

"ఆమె కూడా రావాలిగా..." అంటూ అతని గదిముందు నిల్చున్న కానిస్టేబుల్‌తో

"ఆ నిర్మల అనే ఆమె వచ్చిందా?" అని అడిగాడు.

"వచ్చింది సార్" అన్నాడా కానిస్టేబుల్.

"రమ్మను" అంటూ సంతోష్ వైపు తిరిగి "మీ సార్‌ను కూడా రమ్మను" అన్నాడు.

రాజగోపాలరావు సీ.ఐ గారి గదిలో ప్రవేశించాడు. బలరాములు అప్పటికి ఇప్పటికీ చాలా వొళ్ళు చేశాడు. ఆరున్నర అడుగుల ఎత్తుండే అతడు బాగా లావెక్కడంతో చిన్నపాటి ఏనుగులా కనిపించాడు. పోలీసు యూనిఫామ్‌లో మనిషి చాలా గంభీరంగా కనిపించాడు. నేనో పెద్ద పోలీసాఫీసర్‌నన్న దర్పం అతనిలో స్పష్టంగా కనిపించింది. అతన్ని చూడగానే

"నమస్కారం బలరాములు గారూ!" అన్నాడు రాజగోపాలరావు.

"నన్ను పేరుతో పిలవొద్దు. సీ.ఐ. గారు అంటే చాలు" అన్నాడు బలరాములు చాలా కటువుగా.

"కూర్చొండి సార్!" అన్నాడు సంతోష్. రాజగోపాలరావు వైపు అక్కడున్న ఓ కుర్చీని జరుపుతూ

"కావాలంటే నువ్వు కూర్చో సంతోష్... ఆయన మీద కంప్లెయింటుంది. ఆయన కూర్చోవటానికి వీల్లేదు" అన్నాడు సీ.ఐ. బలరాములు.

"బెస్ట్ టీచర్‌గా నేషనల్ అవార్డు గ్రహీతను కూర్చోవద్దంటావా?" అన్నాడు సంతోష్ కోపంగా.

"హీ ఈజ్ అక్యూస్డ్... ఆయన కూర్చోవడానికి వీల్లేదు..." అన్నాడు బలరాములు,

"ఎవరో ఒకరు పచ్చి అబద్దాలతో కంప్లెయింట్ ఇచ్చినంతమాత్రాన అక్యూజ్డ్... అంటే నిందితుడవుతాడా? ఆ కంప్లెయింట్‌లో పేర్కొనబడిన అంశాలమీద ఎంక్వైరీ చేశావా? కేసు రిజిష్టర్ చేసి చార్జిషీట్ దాఖలు చేస్తే అప్పుడు నిందితుడవుతాడు" అన్నాడు సంతోష్

"ఇట్స్ ఆల్‌రైట్ సీ.ఐ. గారూ. నేను నిల్చొనే ఉంటాను..." అన్నాడు రాజగోపాలరావు ఎలాంటి సంకోచం లేకుండా.

"మిమ్మల్ని నిల్చోబెట్టి మాట్లాడుతున్నందుకు మీ ఈగో చాలా దెబ్బతిని ఉంటుంది. బట్ ఐ కాంట్ హెల్పిట్..." అన్నాడు సీ.ఐ.

"ఇట్ డజంట్ మ్యాటర్. నా ఈగో చాలా చిన్నది సీ.ఐ గారూ! ఎలాంటి పరిస్థితికైనా అడ్జస్టవుతుంది..." అన్నాడు రాజగోపాలరావు.

"నువ్వు కూర్చోవచ్చు మిస్టర్ సంతోష్" అన్నాడు సీ.ఐ.

"నేనూ కూర్చోను సీ.ఐ. గారు. అంత పెద్దమనిషిని నిల్చోబెట్టి నేను కూర్చుంటానా?" అన్నాడు సంతోష్.

"నీ ఇష్టం... చెప్పమ్మా నిర్మలా? ఒకప్పటి నీ యజమాని మీద నీ కంప్లెయింటేమిటి?" అన్నాడు సీ.ఐ. ఆ రూంలో ఓ పక్కగా నిల్చున్న నిర్మల వైపు తిరిగి.

"ఇంతసేపూ నిర్మల ఆ గదిలోనే ఉన్నట్టు గమనించనేలేదే" అనుకున్నాడు రాజగోపాల్.

"వీళ్ళింట్లో నేను ఆరునెలల నుండి పని చేస్తున్నాను సార్... మొదటి రెణ్నెళ్ళు వీళ్ళు మంచివాళ్ళు లాగానే కనిపించారు. వీళ్ళింట్లో అన్నిపనులు నేనే చేసేదాన్ని. ఈయన భార్య కీళ్ళనొప్పులతో మంచం మీంచి దిగదు. ఈయన కూతురేమో మెడిసిన్ చదువుతూ ఎప్పుడూ కాలేజికి పరిగెత్తుతుంటుంది. వీళ్ళక్కీ మాకు బాగా డబ్బుందన్న గర్వం.... పనిమనిషంటే అదో పనిచేసే యంత్రం అన్నట్టుగా చూస్తారు... ఈయన భార్యకు బాగా అనుమానం... నేను ఇంట్లోంచి అన్నీ ఎత్తుకుపోతున్నానని... అంతేకాదు.... ఆమె భర్తతో కూడా నేను సరసమాడుతున్నానని... ఈయనకేమో మంచానపడ్డ భార్యతో ఎలాంటి సుఖం లేదు. అందుకని ఆ సుఖాన్ని నా ద్వారా పొందుదామని నాకేసి ఆశగా చూస్తుండేవాడు. యేదో నెపంతో నన్ను తాకుతుండేవాడు. మొన్నొకరోజు ఈయన నన్ను వాళ్ళ బెడ్‌రూంలోనే బలవంతంగా అనుభవించే ప్రయత్నం చేశాడు. నాకీయన నువ్వు అడిగినంత డబ్బిస్తానని ప్యాంట్ జేబులోంచి పదివేల రూపాయలు తీసి ఇవ్వబోయాడు. నేను తప్పించుకొని బయటపడ్డాను... ఈయన భార్యేమో నామీద దొంగతనం నేరం మోపి నన్ను మానసికంగా హింసించింది. ఈయన కూతురేమో... ఆమెకు కాఫీ ఇవ్వడం ఆలస్యమైనా, టిఫిన్ పెట్టడం ఆలస్యమైనా 'స్టుపిడ్', 'షిట్', 'బిచ్' అంటూ తిట్టి అవమానించేది"

"అవి ఆమె మీ మీద మోపుతున్న అభియోగాలు... ఇందుకు మీ సమాధానం" అన్నాడు సీ.ఐ. రాజగోపాలరావు వైపు చూస్తూ. నిర్మల మాటలు విన్న మరుక్షణం నుండి రాజగోపాలరావులో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకొని ప్రవహించాయి.

"ఆమె చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు... మేమామెను మా ఫ్యామిలీ మెంబర్‌లా చూసుకున్నాం... ఈమె నామీద సెక్సువల్ హరాస్‌మెంట్ అనే నేరం మోపడం - సింప్లీ షాకింగ్! ఈమె నాకు నా కన్నకూతురు అర్చనతో సమానం... ఈమెను నేనేనాడు ఆ దృష్టితో చూడలేదు. బెడ్‌రూంలో ఈమె నా ప్యాంట్ జేబులోంచి పదివేల రూపాయల క్యాష్ దొంగిలిస్తూ కనిపించింది. నన్ను చూడగానే ఆ డబ్బును మళ్ళీ ప్యాంట్ జేబులో పెట్టేయబోయింది. "దొంగతనం చేస్తున్నావా నిర్మలా!" అన్నాను.

నీకు డబ్బవసరం ఉంటే నన్నడిగితే ఇచ్చేవాడిని కదా? అన్నాను. అంతే నామీద దొంగతనం నేరం మోపుతావా అంటూ పెద్దగా అరుస్తూ బయటకెళ్ళిపోయింది. నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను, యాక్చువల్‌గా జరిగిందిది" అన్నాడు రాజగోపాల్ కంఠాన్ని పెంచి చాలా గంభీరంగా.

"ఈమెను నేనే రాజగోపాలరావు గారింట్లో పనిమనిషిగా కుదిరించాను. రాజగోపాలరావు గారెంత గొప్ప వ్యక్తో అందరికీ తెలుసు... ఆయన మీద ఇలాంటి నేరం మోపడం నీచాతినీచం" అన్నాడు సంతోష్.

"పైకి అందరూ గొప్ప వ్యక్తుల్లాగే కనబడ్తారు. దగ్గరికెళ్ళి చూస్తే గానీ అసలు రూపం బయటపడ్తుంది" అంది నిర్మల.

"నిన్ను రాజగోపాలరావు లైంగికంగా వేధించాడు అనడానికి సాక్ష్యమేదైనా ఉందా?" అన్నాడు సీ.ఐ.

"ఎక్కడో ఇంట్లో బెడ్‌రూంలో జరిగిన దానికి సాక్ష్యమేముంటది సార్..." అంది నిర్మల.

"సరె. నువ్వెళ్ళు. మేం ఎంక్వైరీ చేస్తాం. నీ కంప్లెయింట్‌లో వాస్తవమేదన్న ఉంటే ఆయన్ను అరెస్ట్ చేసి, చార్జిషీటు దాఖలు చేసి కోర్టుకు పంపిస్తాం..." అన్నాడు సీ.ఐ.

"నాకు న్యాయం చెయ్యండి సార్!" అంటూ నిర్మల వెళ్ళిపోయింది.

"మీరు కూడా వెళ్ళండి. నేను మీవాడకొచ్చి మీ ఇంట్లో యేం జరిగిందో ఎంక్వైరీ చేస్తాను" అన్నాడు సీ.ఐ. రాజగోపాలరావునుద్దేశించి.

రాజగోపాలరావు బయటకొచ్చాడు. సంతోష్‌కుమార్ సీ.ఐ. బలరాములుతో కాస్సేపు మాట్లాడి బయటకొచ్చాడు. ఇద్దరూ వెళ్ళి కార్లో కూర్చున్నాక సంతోష్ చెప్పాడు

"ఈ కేసును యేదోరకంగా పరిష్కారం చేస్తానంటున్నాడు సీ.ఐ బలరాములు" అన్నాడు సంతోష్.

"యేదో రకంగా అంటే" అన్నాడు రాజగోపాలరావు.

"దానికి కొన్ని డబ్బులిప్పించి కంప్లెయింట్‌ను విత్‌డ్రా చేసుకొమ్మంటాడనుకుంటాను... నిర్మల బలరాములు చెప్పినట్టు వింటుంది" అన్నాడు సంతోష్.

"దానికి డబ్బులెందుకివ్వాలి?" అడిగాడు రాజగోపాలరావు.

"ఇవ్వక తప్పదేమో సార్! లేకపోతే అది మిమ్మల్ని చాలా బదనామ్ చేస్తుంది. మీడియా వాళ్ళ దగ్గరికెళ్ళి మీరు తనని లైంగికంగా వేధించారని చెబుతానంటోందట.

మీడియా వాళ్ళకు వాస్తవంగా యేం జరిగిందో అవసరం లేదు... వాళ్ళకు సెన్సేషన్ కావాలి. జాతీయ అవార్డు పుచ్చుకున్న ఓ గౌరవనీయుడైన లెక్చరర్ ఓ స్త్రీని బలత్కారం చేయబోయాడన్న వార్త చాలా సెన్సేషన్‌ను క్రియేట్ చేస్తుంది. మన సమాజంలోని చాలామంది ఫలానా వ్యక్తి గొప్పవాడని ప్రచారం జరిగితే ఆ వ్యక్తిమీద ఈర్ష్యను పెంచుకుంటారు. "యేమిటతని గొప్పతనం" అని ప్రశ్నిస్తారు. మనకంటే నైతికంగా ఒక వ్యక్తి ఓ మెట్టు పైనున్నాడంటే మనం వెంటనే అంగీకరించం. అతన్ని మనమున్న చోటికే... అంటే కిందకు లాగే ప్రయత్నం చేస్తాం...అలాంటి వాళ్ళు మీమీద వచ్చిన ఇలాంటి తప్పుడు అభియోగాల్ని వినగానే భలే సంబరపడిపోతారు. "ఇది నిజమేనా?" అని ఆలోచించరు. కొందరు మీరంటే ఈర్ష్యపడేవారు బాగా జరిగిందని లోలోపల సంతోషిస్తారు. చాలామంది మనముందొకలా, మన వెనక ఒకలా ప్రవర్తిస్తారు సార్! నిజం నిలకడమీద తెలుస్తుందనుకొండి. కానీ ఈలోగా జరగాల్సిన డామేజి జరిగిపోతుంది. అందువల్ల సాధ్యమైనంత త్వరగా మనమీ రొంపిలోంచి బయటపడాలి సార్!" అన్నాడు సంతోష్.

రాజగోపాలరావు ఆలోచిస్తూ మాట్లాడలేదు. సంతోష్ చెప్పిన మాటల్లో చాలా నిజముందనిపించిందతనికి.

రెండ్రోజుల తర్వాత ఓరోజు రాత్రి సీ.ఐ. బలరాములు రాజగోపాలరావుకు ఫోన్ చేశాడు. ఆ రెండ్రోజులు రాజగోపాలరావింట్లో విషాదం తాండవించింది. రాజగోపాలరావుకు తనమీద ఇలాంటి అభియోగాలు రావడం అతన్ని తీవ్రంగా కలచివేసింది. అతనికి భోజనం చెయ్యాలనిపించలేదు. నిద్ర అతనికి దూరమైపోయింది. సావిత్రమ్మ, అర్చన పరిస్థితి కూడా అలాగే మారిపోయింది.

"పోలీసు స్టేషన్లో నా ప్రవర్తన మిమ్మల్ని చాలా బాధపెట్టి ఉంటుంది. మీమీద సీరియస్ కంప్లెయింటుంది కాబట్టి నేను చాలా హార్ష్‌గా కనిపించాల్సి వచ్చింది. కానీ మీకు నేను సహాయం చేస్తాను సార్! ఈ కేసును గురించి బయట ప్రచారం జరగక ముందే మిమ్మల్ని కేసు నుండి కాపాడ్తాను సార్. మీరేమీ వర్రీ కాకండి. మీమీదే కాకుండా అది మీ మిసెస్ మీద, మీ డాటర్‌మీద కూడా అభియోగాలు మోపింది... మీ మొత్తం కుటుంబాన్నే అపఖ్యాతిపాలు చేసే ప్రయత్నం చేస్తోంది. కానీ నేను మీ కుటుంబాన్ని కాపాడ్తాను సార్. ఒకప్పుడు మీరు నాకు చాలా సహాయం చేశారు. ఆ రుణాన్ని తీర్చుకునే అవకాశాన్ని నాకిప్పుడు ఆ భగవంతుడు కల్పించాడు సార్... మీ రుణాన్ని తీర్చుకుంటాను సార్... డోన్ట్ వర్రీ సార్... మళ్ళీ మీరు పోలీసు

స్టేషన్‌కు రావలసిన అవసరం లేదు సార్! సంతోష్‌ను పంపించండి. సంతోష్‌ను నాతో టచ్‌లో ఉండమనండి సార్... ఉంటాను సార్... నేను మీతో ఇలా మాట్లాడినట్టు ఎవరికీ తెలియకూడదు సార్... ఉంటాను సార్!" అంటూ అతడు ఫోన్ పెట్టేశాడు.

అతని మాటలు విన్నాక రాజగోపాలరావు హృదయం కాస్త కుదుటపడింది. అయినప్పటికీ అతడికింకా నిద్రాహారాలకు దూరంగానే ఉండిపోయాయి. యేక్షణంలో యేవార్త వినాల్సి వస్తుందోనని అతడు విపరీతమైన ఆందోళనకు గురవుతూనే ఉన్నాడు. అతని భార్య సావిత్రమ్మ, అతని కూతురు అర్చన 'మీరు వెళ్ళి ఎవరైనా అడ్వొకేటును కలిసిరండని సలహా ఇచ్చారు.

"అక్కర్లేదు. అన్నీ సంతోష్ చూసుకుంటాడు" అన్నాడు రాజగోపాలరావు.

"ఆ సంతోష్‌ని మీరింకా నమ్ముతున్నారు. అతడే మనల్నీరొంపిలోకి దించాడు" అంది అర్చన.

వారం పదిరోజుల తర్వాత సంతోష్‌కుమారొచ్చి రాజగోపాలరావును కలిశాడు.

అతడేం చెబుతాడోనని రాజగోపాలరావు కుటుంబ సభ్యులంతా ఊపిరి బిగబట్టుకొని ఎదురుచూశారు.

"కేసు పరిష్కారమైపోయింది సార్!" అన్నాడు సంతోష్.

"ఎలా పరిష్కారమైంది?" అడిగాడు రాజగోపాలరావు.

"మీరు ఆమెకో యాభైవేలిస్తే ఆమె కంప్లెయింటు విత్‌డ్రా చేసుకునేట్టు బలరాములు ఆమెను ఒప్పించాడు. అది లక్ష రూపాయలమీద కూర్చొంది. దాన్ని బలరాములు 50 వేలకు దించాడు..." అన్నాడు సంతోష్.

"యాభైవేలా? చెయ్యని నేరానికి యాభైవేలా? ఎంత దారుణం..." అన్నారు సావిత్రమ్మ, అర్చన ఒకేసారి.

"నేను పెన్షనర్‌ని. యాభైవేలు ఎక్కడ్నించి తేను?" అన్నాడు రాజగోపాలరావు.

"దీంట్లో నా పాపం కూడా కొంత ఉంది కాబట్టి నేనూ కొంత షేర్ చేస్తాను... దాని మొఖాన ఈ డబ్బు పడేసి దాని పీడా వదిలించుకుందాం సార్" అన్నాడు సంతోష్.

"నువ్వు షేర్ చెయ్యడమెందుకులే సంతోష్... ఆ బాధేదో నేనే పడ్తాను..." అన్నాడు రాజగోపాల్.

"మరో విషయం సార్... తను మీకీ సహాయం చేసినందుకు సీ.ఐ. బలరాములు కూడా మీనుండి కొంత ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాడు..."

"బలరాములు నానుండి ప్రతిఫలాన్ని ఆశిస్తున్నాడా? మీ రుణం తీర్చుకునే అవకాశాన్ని సాక్షాత్ భగవంతుడే కల్పించాడన్నాడు..."

"పోలీసువాడు అలాగే అంటాడు సార్! అతడు దాని దగ్గర కూడా కొంత పట్టించాడు. మీదగ్గర కూడా కొంత పట్టించాలనుకుంటున్నాడు"

"ఎంత?"

"అతడు ముప్పై వేలడిగాడు. 20 వేలిస్తారని మీ తరఫున నేను మాటిచ్చాను సార్... ఇరవై వేలేనా అని అతడు కాస్త గింజుకున్నాడు. సార్ పెన్షనర్! పెద్దగా డబ్బున్నవాడు కాడు. దీంతో తృప్తిపడు అని చెప్పి ఒప్పించాను సార్!" అన్నాడు సంతోష్.

కాస్సేపు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"అతడు తన రుణాన్ని ఇలా తీర్చుకున్నాడన్నమాట!" అన్నాడు రాజగోపాలరావు నిర్లిప్తంగా.

'చిత్ర' మాసపత్రిక (డిసెంబర్ 2009)